# యాత్ర

ఒక్కొక్కరి చూపులు కలిసిన వేళా విశేషం అట్లాంటిది. ఒకరిపై ఒకరికి అనురాగాలు మొలకెత్తుతాయి.

కాలేజీలో చదివిన రెండేళ్ల డిగ్రీ కోర్సులోనూ ఏ ఒక్క 'మనోహరి' నీ కన్నెత్తి చూడలేదు నరసింహం. ఏదో తన మట్టుకు తను పాఠ్య గ్రంథాలు చదువుకోడం, వేళపట్టున క్లాసు కెళ్లి రావడం తప్ప. అతనికి మిత్రులు కూడా ఎక్కువ లేరు. ఉన్న ఏ కొద్ది మందితోనో అప్పుడప్పుడు అలా బీచ్‌కి వెళ్లడం చేస్తాడు. మిత భాషి.

ఇటువంటి వాడు రైలుబండిలో ఒక అమ్మాయిని చూసి, భావజుని అతి మృదులమైన, కోమలమైన 'పూల' బాణాలకు గురి అయ్యాడంటే కొద్ది ఆశ్యర్యం చెందవలసిన విషయమే! నిజమే మరి.... ఆదియోగి, ఇంద్రియ నిగ్రహం గల చిత్తజుని మెత్తని పూల బాణాలకు చిత్తయిపోయాడు!

వేసవి సెలవు లిచ్చారు. పెట్టె, బెడ్డింగు చుట్టి, ఆఖరుసారిగా కళాశాలకు సెల్యూట్ కొట్టి, సెకండ్ క్లాస్ కంపార్టుమెంటులో కూర్చున్న నరసింహానికి-ఒక ముదుసలి, ఆ ముదుసలికి కొంచెం దూరంగా ఒక్క కోమలాంగీ ఎదురుగా ఉన్న సీట్లో కనపడ్డారు.

నవరసజ్ఞు లైన కవి పుంగవులు స్త్రీలను గురించి వర్ణనలు చేసినప్పుడు పద్మముఖి, కంజదళాక్షి అని అంటే - అవన్నీ శుద్ధ అబద్ధమని, వంచితాత్ముడై కవి అట్లా ఊహించి వర్ణిస్తున్నాడని కవులను నిందించే నరసింహం, ఇప్పుడు, ఈ రైలులో, ఈమెను చూచి- 'ఒక్క పద్మముఖి అంటే సరిపోదు. ప్రఫుల్ల పద్మ విలసమ్మఖి అని తీరా లీమెను!' అని దృఢసంకల్పు డయ్యాడు. ఆమె ముఖారవిందం అతన్నెంతగానో ఆకర్షించింది.

కానీ ఆమెతో, పరిచయానికై మాట్లాడే దెట్లా? తనెన్నడైనా ఏ స్త్రీతోనైనా మాట్లాడి ఎరిగేడా? ఒక్క అక్కయ్యలతోనూ అమ్మతోనూ తప్ప! ఒకవేళ ఏమైనా ఊఁ ఆఁ అంటే-ఆమె ప్రక్కనే వృద్ధు డొకడు దాపరించాడు కదా! తండ్రో, తాతయ్యో ఐతే, కళ్లు జిగేల్‌మన్నట్లు, చెంప పగలకొట్టేస్తాడు.

అతనికి ఎన్నో పెళ్లి సంబంధాలు వచ్చాయి. రెండు వేలిస్తామని కొందరు రెండేళ్లూ చదివించేస్తా మని కొందరు వచ్చారు. పిల్లను చూసుకుందికి రమ్మని దూరదేశాల నుంచి సైతం ఎన్నో ఆహ్వానాలు వచ్చాయి. 'సొంత టిక్కెట్టుఖర్చు పెట్టు కొని పెళ్లి కూతుళ్లని చూడ్డానికి రాకపోకలు చేసే సరికీ ఓ వెయ్యి రూపాయ లైపోతాయి. ఇంక మామగారిచ్చే కట్నానికి సరైన గిట్టింపే లేదు, అని అతడంటాడేమో నని కొందరు మామలు కాదలచిన వారు 'ట్రావెలింగ్ అలవెన్సు' కూడా ఇచ్చుకుంటామన్నారు. ఇంకొందరు పిల్లల్నే అతని ఇంటికి తీసుకు వచ్చారు. కాని, అతడు తన తల్లిదండ్రు లెంత చెప్పినా ఆ పెళ్లి కూతుళ్లని చూడలేదు.

ఇట్టి నరసింహానికి, ఈ రైలులో కనుపించిన 'ప్రఫుల్ల పద్మ విలసన్ముఖి' కి దాసుడనై పోదామనిపించింది. ఈ మెనేకాని పెళ్లి చేసుకుంటె, దమ్మిడీ కట్నం అక్కర్లేదు సరికదా - తిరిగీ తనే కన్యాశుల్కం ఇచ్చే నిర్ణయానికి వచ్చాడు. ఇంకా అలా ఆమెను తేరిపార చూస్తే, ముసలాడు అనుమానిస్తా డేమోనని- అలా కేవలం ఆమె ముఖారవిందాన్నే తల్చుకుంటూ హాండ్‌బాగ్‌లో వున్న 'కథల పత్రిక' తీశాడు.

"ఏమండీ?" ఓ స్త్రీ కంఠం.

నరసింహం అటూ ఇటూ చూశాడు. ఎవరు చెప్మా? అతన్నేనా ఆ పిలుస్తున్నది? అతన్ని కాదేమో నని కథా పఠనం చేసే ప్రయత్నంలో వుండగా - "ఏమండీ మిస్టర్! మిమ్మల్నే-ఆ పుస్తకం చూశాక దయచేసి ఓసా రివ్వండి.." అన్నదామె.

నరసింహం గుండెలు కొట్టుకున్నాయి. కొంచెం సంబాళించుకొని "పుస్తకమా? చూడండి. మీరు చూశాకనే ఇవ్వండి!" అని ఆమె చేతిలో ఆ పుస్తకం పెట్టేశాడు.

తనే ముందు పలకరిస్తే ఏం పుట్టి ములుగు తుందో అని భయపడిన అతనికి ఇహ బెడద తీరింది. విస్తరాకు వెళ్లి ముల్లుమీద పడకుండా, ముల్లే వెళ్లి విస్తరాకుమీద పడ్డది. ఆమెతో మాట్లాడ్డాని కింక ఎట్టి అభ్యంతరమూ వుండదు. ఐనా మాట్లాడ్డానికివిషయ మేముంది గనుక? 'ఒక భావకవినైనా అయినాను కాదు గదా!' అని మథన పడ్డాడు 'అట్లా అయితే - అర్థం పర్థం లేని, వావి వరుసలు లేని, గద్యమో పద్యమో పోల్చలేని, అల్లి బిల్లి పిల్లి మొగ్గల కవిత్వం అల్లేసేవాణ్ణి కదా!' అనుకున్నాడు.

ఏదో స్టేషన్ వచ్చింది ముసలాయ నొక్కడూ ఎందుకో దిగాడు. అతను సామాను వదిలేసి దిగి వెళ్లడం చూస్తే, బహుశః కాఫీకేమో అనుకున్నాడు ఇప్పు డామెతో ఏం మాట్లాడినా పరవాలేదనుకున్నాడు.

"అతను మీ తండ్రిగారా?" అడిగాడు గుండె దిటవు చేసుకొని.

"ఆ ముసలాయనా? అబ్బే- ఏమీ కార్లెండి!" జవా బిచ్చిం దామె.

ఈ జవాబుతో అతనికి మరీ ధైర్యం ఎక్కువైంది. "ఎంతవరకూ మీ ప్రయాణం?" అన్నాడు.

"దగ్గర కొచ్చేసింది లెండి. ఈ ప్రక్క స్టేషనే!" అని ఆమె సమాధానం చెప్పడంతో నరసింహం ఆశలన్నీ నిరాశ లైనాయి. ఇంకా తనలాగే ఆమె కూడా దూర

ప్రయాణీకురాలేమో-మార్గ మధ్యంలో కాఫీలూ టిఫిన్లూ తెచ్చిపెడుతూ, అవకాశం ఉన్నంత మట్టుకు ఆమె వివాహాది విషయాలు చర్చిద్దా మనుకున్నాడు.

రైలు కదిలింది.

బుక్ స్టాల్లో ఏదో పుస్తకం కొనుక్కుని ముసలాయిన వచ్చి, తన స్థలంలో తాను కూలబడ్డాడు అతని చేతిలోని పుస్తకం వైపు చూశాడు నరసింహం. 'ఉమర్‌ఖయ్యాం' గ్రంథం అది.

అతడు ఇహ నామెతో ఏం మాట్లాడినా ప్రయోజనం లేదు కదా అనే అభిప్రాయంతో మౌనం దాల్చాడు. స్టేషన్ వచ్చేసింది. అతనికి పుస్తకం ఇచ్చేసి "థాంక్సు! వస్తాను సెలవ్!" అంటూ రైలు దిగి వెళ్లి పోయింది ఆ స్త్రీమూర్తి.

అతని కళ్లు కాయలు కాచిపోయాయి. నిఖిలలోక వంద్యుడూ, సర్వజ్ఞుడూ అయిన ఉమర్‌ఖయ్యామ్, తన పాలిట దైవంగా ఆ 'ముదుసలి' రూపంలో అవతరించాడు, తన మనసులోని భావాన్ని గ్రహించి నీతి చెబుతున్నట్లుగా అన్నాడు:

"ఇల్లాంటి ప్రయాణాల్లో పరిచయాలు శాశ్వతం కావు నాయనా! ఇదంతా ఒక భ్రమ. ఒకరు ఒకచోట రై లెక్కుతారు. వేరొకరు వేరొకటోట. బండిలో ఇరువురికీ పరిచయమౌతుంది. ఎవరి వూరు ముందు వస్తే వారు దిగి పోతారు. అక్కడికా పరిచయం సరి.

-మన జీవనమే ఒక ప్రయాణం నాయనా! మన రాక ఎక్కడనుంచో తెలియదు. పోక ఎక్కడికో తెలియదు. ఈ ప్రయాణానికి ఆద్యంతాలు ఇదమిత్థమని చెప్ప నలవి కాదు. ఏదో జీవన యాత్ర ఇలా చేసుకుపోవలసిందే!"

నరసింహం కళ్లంట నీళ్లు గిర్రున తిరిగాయి. అతనికి భూమి గుండ్రంగా అవుపించింది.

⊗⊗⊗

4-9-1957

**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక**